# మధ్య తరగతి

మధ్య తరగతి మనుగడ విచిత్రమైంది. ఒక విధంగా ఎందుకూ పనికిరానిదేమో అనిపిస్తుంది.

ధన సంపన్నులూ, ఉన్నతమైన పదవులలో ఉన్నవారు ఎప్పుడూ ఉషారుగా, హాయిగా ధైర్యంగా ఉండగలరు. జీవితం ఏటవాలుగా ఉన్నా నిటారుగా నిలబడగలరు. అధికారమూ, ధనమూ రెండు వారికాహోదా నిస్తాయి.

ఇంక అట్టడుగున అందరికన్నా హీనస్థితిలో ఉన్నవారూ ధైర్యం గానే ఉంటారు. వారికి దేనికీ భయపడవలసిన అవసరమే లేదు. ఎందు చేతనంటే వారి బ్రతుకే నడివీధిలో కనుక. ఇంక భయము, లజ్జా, సంకోచము దేనికి! వారు అవసరమైతే అందరితోనూ పోట్లాడగలరు. కాకపోతే చేతులు జోడించి యాచించగలరు. వినయమో, అవినయమో సందర్భాన్ని బట్టి మారుతూ ఉంటుంది.

ఇంక ఇద్దరికీ మధ్యగా వేలాడుతున్న మధ్యతరగతి మనిషి ఎందుకూ పనికి రానివాడు, ఏమీ చేతగానివాడు. చదువు-సంస్కారము, తెలివి తేటలు అన్నీ ఉన్నా ఏదీ పట్టించుకోకుండా మన కెందుకులే అని తప్పించుకు తిరిగేవాడు. ఏ పని చేయటానికీ ధైర్యము, సాహసమూ రెండూ లేనివాడు ఇంటి ముందు మురుగు కాలవ పారుతూ ఉన్నా ఈ దుర్గంధం పక్కింటి వాళ్ళకు, ఎదురింటి వాళ్ళకూ కూడా ఉన్నదీ కదా దీని గొడవ మనకెందుకు అని సరిపుచ్చుకునేవాడు. తన సంసారం, తన జీవితం ఒడిదుడుకులు లేకుండా ఉంటే చాలు. తక్కిన విషయాలు మనకెందుకూ అనే మన

స్తత్వం. ఆశలు, ఆశయాలు లేవని కాదు. అయితే అవి ఎప్పుడూ ఎక్కడో భద్రంగా మూతపడి ఉంటాయి.

మనస్సుకు కూడా మధ్యతరగతి ఉన్నదనుకుంటాను. కొందరు మహనీయులు ఏ పనైనా సాహసించి చేయగలరు. సాధించగలరు. తనదంటూ ఏమీలేకుండా బ్రతక గలరు. మరికొందరు నిద్రా, భోజనం తప్ప మరో ప్రపంచం ఉన్నదని కూడా ఊహించలేక జడప్రాయంగా ఉంటారు. మధ్య తరగతి మనసు అటూ ఇటూ కాకుండా మథనపడుతూ ఉంటుందను కుంటాను. ఇట్లాంటి మన స్తత్వం కలవారు సాహసించి ఏ పనీ చెయ్యనూ లేరు, హాయిగా ఏమీ తెలియకుండా నిద్రపోనూలేరు ఇదొక రకమైన నరకయాతన. మనస్సే ఒకరకమైన కురుక్షేత్రం అంటే ఇదేనేమో మరి!

మధ్యాహ్నమంతా ఒక సుదీర్ఘమైన వ్యాసం చదువుతున్నాను. ఒక అమెరికన్ వ్రాసింది. అతను అమెరికాలో ఒక రాష్ట్రానికి గవర్నరుగా పదవిలో ఉండి ఆ జీవితంతో విరక్తిచెంది ఇండియా వచ్చాడట. కలకత్తాలో మదర్ థెరిసా ఆశ్రమం చూడాలని, ఆమె అనాథలకు చేస్తున్న సేవను ప్రత్యక్షంగా చూసి తెలుసుకోవాలని వచ్చాడట. ఆ తరువాత ఆ ఆశ్రమంలో తను గడిపిన రోజులు అక్కడ తన అనుభవాలు, ఆ వాతావరణం. అవి అతని మనస్సులో నింపిన నిర్వేదం అంతా విపులంగా వ్రాశాడు. తను కూడా ఏదైనా చెయ్యగలిగితే బాగుండునన్న తపన, అతని ఆవేదన ఆ వ్యాసంలో అంతటా వ్యక్తమవుతున్నాయి.

మదర్ థెరిసా ఓపిక, త్యాగము ఎందరికి ఉంటాయి? వయస్సు మళ్ళినా, గుండె జబ్బు బాధ కలిగిస్తున్నా ఆవిడ అలా దేశాలు తిరుగుతూనే ఉండి రాత్రింబవళ్లు తన ధ్యేయంలో నిమగ్నమయ్యే ఉంటుంది. అది అందరికీ అందుబాటులో ఉండదు.

అయినా ఆ అమెరికన్ తపన పడ్డాడు. అంటువ్యాధిలా ఆ బాధ

ఇప్పుడు నన్నలముకొన్నట్లనిపించింది. నేనూ చాలా నిరర్ధకమైన జీవితాన్ని గడుపుతున్నాననే వ్యధ కమ్ముకుంది. పర్వతాన్ని ఎత్తలేకపోయినా పరమాణువునైనా ఎత్తగల శక్తి ఉండవచ్చును గదా! అదీ కూడా చెయ్యలేక పోతున్నానేమోనన్న ఆలోచన పట్టుకుంది. ఇది గమ్యం తెలియక పోవడమో, ఓపిక లేకపోవడమో ఏదైనా కావచ్చు!

ఈ రోజుకి ఈ విషాదం ఇంక నన్ను వదలిపెట్టదు. మిట్ట మధ్యాహ్నం ఎండ బాగానే కాస్తోంది. అవతలి పక్కన ఉన్న చెట్లు పందిరిలా నీడను కప్పుతున్నాయి ఎండ కనపడకుండా. ఎప్పుడో ఒకసారి మనసులో ఒక విషాదరేఖ మెరుస్తుంది. మళ్లా మనసులో మబ్బులు కమ్ముకుంటాయి. జడప్రాయమైన బ్రతుకు జడప్రాయంగానే ఉండిపోతుంది. బయటపడే ఓపిక ఉండదు.

కిటికీలోంచి చెట్ల నీడలను చూస్తున్నాను. వీధి అంతా నిశ్శబ్ద వాతావరణం. ఆ చెట్ల నీడలు ఎన్నో ఏళ్ళ క్రిందట ఎప్పుడో చూచిన పల్లె ప్రాంతాన్ని గుర్తుకు తెస్తున్నాయి.

ఎప్పుడో చిన్నప్పుడు శ్యామలక్కయ్యగారి ఊరు వెళ్లాను. సెలవలకి వెళ్ళానేమో. ఏమీ గుర్తులేదు. అది చాలా పల్లెటూరు. తోవకూడా సరిగ్గా లేదు. చెట్ల మధ్య నుంచి ఎడ్లబండిలో వెళ్ళడం మాత్రమే గుర్తు ఉంది ఆ ఊరికల్లా అక్కయ్య ఇల్లే చాలా పెద్దది. ఆ ఊళ్ళోకల్లా వాళ్ళే ధనవంతులేమో చుట్టుపక్కల ఇళ్లు అంత విశాలంగా కూడా ఉన్నట్లనిపించలేదు. చుట్టూ పొలాలు, చెట్లూ, దూరంగా కొండలూ తప్ప అసలు ఇళ్ళు కూడా ఎక్కువ కనిపించలేదు. అక్కయ్య ఇంటి వీధి అరుగులు గచ్చుతో పెద్దవిగా ఉన్నాయి. అక్కడే బావ మకాం. నిర్లిప్తంగా విసురుకుంటూ కూచుని ఉండేవాడు. ఎవరైనా వచ్చినప్పుడు కాస్త కాస్సేపు మాట్లాడుతూ కాలం గడుపుతూ ఉండేవాడు.

లోపలివైపు మండువా ఇంకా చాలా విశాలంగా పెద్దదిగా ఉండేది. అక్కయ్య ఎప్పుడూ అక్కడే కూర్చుని ఉండేది. చుట్టూ చుట్టాలు, పనివాళ్ళు, ఇరుగూ పొరుగూ అంతా చేరేవారు. అక్కడ కాలక్షేపానికి కొదవలేకుండా ఉండేది. ఎప్పుడూ అక్కయ్య పక్కన అక్కడే కూర్చుని ఉండేదాన్ని. వచ్చిన వాళ్ళనందరిని చూస్తూ, అందరికబుర్లు వింటూ. రోజూ సంభాషణ ఇంచుమించుగా ఒకే తీరున ఉండేది. ఎప్పుడూ ఎవరో ఒకరు వచ్చి ఏదో ఒక బాధ చెబుతూ ఉండడం అక్కయ్య ఆ బరువు తనదేనని వాళ్ళ బాధలు నెత్తిన వేసుకుని వాళ్ళని ఆదరిస్తూ ఉండడం. ఇది ఇంచు మించు ఆవిడ దినచర్యగా ఉండేది. ఒకరోజు ఒకావిడ వచ్చింది గాభరాగా "ఆయన కాలికి తగిలిన గాయం మాననేలేదమ్మా. సెప్టిక్ అయిందంటు న్నారు ఆయన-" ఇంకేం చెప్పలేక కళ్ళు తుడుచుకుంటూ కూర్చుంది. తమలపాకులు తుడిచిపెడుతున్న అక్కయ్య ఏమీ చెక్కుచెదరలేదు. తన పని తాను చేసుకుంటూనే అన్నది. "నువ్వేం భయపడకు. నేను బండి కట్టించి పట్నం పంపిస్తానులే అదే తగ్గిపోతుంది" అంది. ఆవిడ కాస్త ఊరటపొందింది. కళ్ళు తుడుచుకుంది. ఇంకోసారి ఇంకోకావిడ వచ్చింది. "పట్నం నుంచి మావాడు కబురుపెట్టాడమ్మా వారం రోజుల్లో స్కూలు ఫీజు, పరీక్ష ఫీజు అన్నీ కట్టాలట" అన్నది. ఎప్పుడూ ఎవరో ఒకరువచ్చి ఏదో ఒకటి చెప్పడము, అడగడము అక్కయ్య ఒక్క క్షణమైనా ఆలో చించకుండా అన్నీ సర్దుబాటు చేస్తూఉండడం ఆ ఇంట్లో అతి సహజంగా నిత్యకృత్యంగా ఉండేవి.

అక్కడ ఉన్న వారం రోజుల్లో అక్కయ్య జీవితం నాకు వింతగా తోచింది. ఆవిడ తనకోసం ఏదైనా కావాలని ఆలోచించడం నాకెప్పుడూ కనపడలేదు. ఎప్పుడూ అందరి సమస్యలూ బాధలూ తనవేనని వాటిని గురించి తాపత్రయపడడం మాత్రమే కనిపించింది. అందరి గొడవలు

ఆవిడ కెందుకూ అని అప్పుడప్పుడూ నేననుకునేదాన్ని. కాని ఆవిడ అలా ఎప్పుడూ అనుకోలేదు. అందరూ మనవాళ్ళే అన్నీ మనకు కావలిసినవే అనుకునేది. అది ఆవిడ స్వభావం.

ఆవిడేదో ఘనకార్యం చేస్తోందని అప్పట్లో ఆవిడా అనుకోలేదు. నేనూ అనుకోలేదు. ఇప్పుడు కాలం మారింది. ఆ పల్లెకిప్పుడు తోవ ఎటో నాకు తెలియదు. మా అక్కయ్య బావ ఇద్దరూ పోయి చాలా రోజులైంది. ఏదో కలలా మనసులో మిగిలింది జ్ఞాపకం మాత్రమే.

ఆలోచనల్లో పడితే కాలం గడిచిపోతున్నదే తెలీదు. ఎండ కాస్త తగ్గుతోంది. పనిమనిషి వచ్చింది. నిద్రపోతున్న శేషమ్మ లేచింది. గిన్నెలు చప్పుడవుతున్నాయి. తలుపులు తెరుచుకుంటున్నాయి. ఏవేవో ఊహించుకుంటూ పరుగులు పెట్టిన మనసు మళ్ళా మామూలు ధోరణికి మళ్ళుతోంది.

గేటు తెరుచుకుంది. కారు లోపలికి వచ్చింది. అతను వచ్చాడు. హాల్లోకి రాగానే చెప్పాడు "రాత్రి డిన్నరుకు వెళ్ళాలి. కలకత్తా నుంచి మా కంపెనీ మేనేజరు వచ్చాడు కదా! నరసింహం ఇంట్లో డిన్నరు ఏర్పాటు చేశాం" చెబుతూనే మేడమీదికి వెళ్ళాడు. మళ్ళా వెళ్ళాలి కాబోలు అనుకుంటూ ఆలోచిస్తూ నిల్చున్నాను.

ఈసారి డిన్నరు భారం నరసింహం భార్య మీద పడిందన్నమాట. వంతులవారీగా ఎవరిమీదో ఒకరిమీద పడుతూ ఉంటుంది అన్నీ అమర్చవలసిన బాధ్యత.

ఈ మేనేజరు కాస్త మంచివాడే. ఎక్కువ మాట్లాడడు. ఏవో కావాల్సినవి కాస్త రుచి చూసినట్లు చూసి తొందరగా వెళ్ళిపోతాడు. అలసిపోకుండా ఇల్లు చేరవచ్చు.

ఇంక ఇవ్వాళ శేషమ్మకు సెలవన్నమాట. హాయిగా నిద్రపోతుంది.

యాంత్రికంగా చర్విత చర్వణంగా ఈ జీవితం విసుగుపుడుతోంది. ప్రతినిత్యము ఒకటే క్రమము. అప్పుడప్పుడూ అవే డిన్నర్లు. అవే చిరు నవ్వులు. అవే కబుర్లు. జడప్రాయమైన ఈ జీవితంలో అణుమాత్రం ప్రయోజనం కనిపించటంలేదు. ఈ జీవితానికి ఇంతకన్నా ఏదో ప్రయోజనము, పరమార్థమూ ఉండాలి. అయినా అది ఏదో స్పష్టంగా తెలియటం లేదు. అప్పుడప్పుడూ మనస్సుకేదో స్ఫురించినట్లు ఉంటుంది. మళ్ళా అది మెరుపులా అప్పుడే మాయమవుతుంది. అది మళ్ళా వెతికి పట్టుకోటానికి చాలా కాలం పడుతుంది. ఈలోగా రోజులు, నెలలు దొర్లిపోతూ ఉంటాయి.

బద్ధకంగా ఆవలిస్తూ కళ్ళు తుడుచుకున్నాను. అతను క్రిందకు దిగి వచ్చి మళ్ళా వెళ్ళడానికి తయారవుతున్నాడు. నేనేమీ మాట్లాడలేదు. అతనే చెప్పాడు. "మళ్ళా వెళ్ళాలి. త్వరగా వస్తానులే. తయారుగా ఉంటావు కదా!"

కారు వెళ్ళిపోయింది. వరండా దాటి వెళ్ళి గేటు మూశాను. మన స్సెందుకో నిర్లిప్తంగా ఉంది. అతనిది ఒకరకమైన యాంత్రిక జీవితం. నాది మరొక రకం. అంతే తేడా. కాకపోతే అతని జీవితానికొక లక్ష్యము, గమ్యము ఉన్నట్లనిపిస్తోంది. నా జీవితం ఏదోనీడలో ఉన్నట్లనిపిస్తోంది.

గేటు దగ్గర నుంచి తిరిగి రాబోతూఉంటే అవతల పక్కన ఓరగా ఎవరో ఉన్నట్లనిపించింది. వెనక్కు తిరిగి నిదానంగా చూశాను. ఎవరో కాదు. అప్పుడప్పుడు వచ్చే మస్తాన్. బాగా చిక్కిపోయి వున్నాడు. కొద్దిగా రొప్పుతున్నాడు. అతను అప్పుడప్పుడూ ఏదో అర్థిస్తూరావడం అలవాటు. వచ్చినప్పుడల్లా ఏదో ఇచ్చి పంపుతూనే ఉంటాను. ఒకసారి మాత్రం విసు గొచ్చింది ఏమీలేదు ఊరికే బద్ధకం, ఇతన్ని చూడగానే మేడదిగి రావాలి. ఏదైనా ఇచ్చి పంపాలి. అదీ విసుగు. అతను ఓపిగ్గా నేను చూసి వచ్చే

దాకా ఆ గేటుదగ్గర అలా ఒద్దికగా ఒదిగి నిల్చుని ఉంటాడు. ఎప్పుడూ లోపలికి రాడు. పిలవడు. అలానే ఉంటాడు.

ఒకరోజు నిద్దర బద్ధకంతో ఆవలిస్తున్న నాకు ఇతన్ని చూడగానే విసుగొచ్చింది. అప్పుడే నిద్దరలేచాను. మా మేడమీద ముందరవేపు కాస్త దాబా ఉంది. అక్కడ చల్లగా ఉంటుంది. కొద్దిగా పూల మొక్కలు ఉన్నాయి. పూల మొక్కలు చూస్తున్న నాకు హఠాత్తుగా గేటు దగ్గర వదలి పోయిన ఇతను మౌనంగా నిలబడి ఉండడం కనిపించింది. ఆ క్షణం ఎందుకో నాకు అతన్ని చూడగానే విసుగనిపించింది. ఇష్టం లేకుండానే క్రిందికి దిగివచ్చాను. ఏదో ఇచ్చిపంపాను. అయినా కాస్త విసుక్కున్నాను. ఎప్పుడూ ఇలావచ్చి కూర్చుంటే ఎలా అని. అతనికి బాధ కలిగినట్లుంది. బాధగా అన్నాడు "ఎప్పుడూ రావడంలేదమ్మా, నెలకొక్కసారి మాత్రమే వస్తున్నాను అని. నేను తెల్లబోయాను. అతను వెళ్ళబోయాడు. యాచనకు వచ్చినా మనిషికి రోషము, అభిమానము ఉంటాయి. మనుష్యులందరూ ఒక్కటే గదా!

ఇవ్వాళ అతన్ని చూడగానే గుర్తు వచ్చింది. చాలారోజులుగా ఇతను రాలేదని. అదే అడిగాను. "ఈమధ్య నువ్వు రావటంలేదే" అని. బాధగా అన్నాడు "జబ్బుపడ్డానమ్మా ఇంకా బాగాలేదు" అని. అప్పుడు మరొకసారి అతనికేసి నిదానంగా చూశాను. ఆయాసపడుతున్నాడు. నీరసంగా నిలవటానికి కూడా ఓపికలేనట్లున్నాడు. అసలే వయసుమళ్ళిన వాడు. ఇంకా ఎన్నిరోజులు వచ్చి నన్ను అర్థించబోతాడు! అంతిమయాత్ర అట్టే దూరం లేదు.

ఏదో బాధగా లోపలికి వెళ్ళి ఏవో తెచ్చి ఇచ్చాను. అవి అందుకుని దండం పెట్టాడు. కృతజ్ఞతతో ఏదో చెప్పబోయాడు. మూలుగుతూ కాస్త ఊరటగా వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం నుంచి మథనపడుతున్న నాకు కాస్త మనశ్శాంతి దొరికి నట్లయింది. ఏమీ చెయ్యలేక వ్యర్థంగా రోజులు గడుపుతున్నానన్న బాధతో ఉన్న మనస్సుకు ఏదో కాస్త సంతృప్తి కాస్త ఊరట దొరికినట్లయింది. కాస్త ఉపశయనం కలిగింది.

ఎవరు ఎవరికి కృతజ్ఞత చెప్పాలో! ఒక విధంగా నేనే అతనికి కృతజ్ఞత చెప్పాలేమో! అంతా వ్యర్థంకాదు, నేనూ ఏదో కొంచెం చెయ్య గలిగానన్న కాస్త సంతోషము, సంతృప్తి అతను నాకు ఇచ్చి వెళ్ళాడు.

నవ్వు వచ్చింది. ఇదే మధ్యతరగతి ఓదార్పు, ఊరట.

జీవితాలు ఏది ఏదో తెలియకుండా ఒకదానిని ఒకటి పెనవేసుకున్న అలలలాంటివి. అంతా ఒకే ఒక నీటి ప్రవాహం.